బస్సును జెండాఊపి ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, కలెక్టర్ వల్లూరు క్రాంతి

మెడికల్ కళాశాలకు బస్సు అందజేత

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 4: సీఎస్ఆర్ నిధులతో మెడికల్ కళాశాలకు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, కలెక్టర్ వల్లూరు క్రాంతి బస్సును అందజేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్, మెడికల్ కళాశాల విద్యార్థులతో కలిసి మంత్రి జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తోషీబా పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో రూ.33 లక్షలతో కొనుగోలు చేసిన నూతన బస్సును మెడికల్ కళాశాలకు కేటాయించామన్నారు. వైద్య విద్యార్థులు బస్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ఘనంగా ఇన్ఫనైట్ వేడుకలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 4: జూనియర్లు సీనియర్లకు వీడ్కోలు పలికే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తారా ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన ఇన్ఫనైట్ 2025 వేడుకలు అంబరాన్నంటాయి. విద్యార్థుల ఈలలు, కేరింతలతో ఇండోర్ స్టేడియం మారుమోగింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన, క్యాట్ వాక్ వంటి వివిధ ప్రదర్శనలతో విద్యార్థినీవిద్యార్థులు అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

సెయింట్ ఆంథోనీస్‌లో అచీవ్‌మెంట్ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఘనంగా అచీవ్‌మెంట్ అవార్డ్స్ వేడుకలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 4: శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో శుక్రవారం అచీవ్‌మెంట్ అవార్డ్స్ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెయింట్ ఆంథోనీస్ పాఠశాల అకడమిక్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి హాజరై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలని, అప్పుడే ఉన్నతమైన జీవితానికి బాటలు పడతాయన్నారు. అనంతరం విద్యార్థులకు అచీవ్‌మెంట్ అవార్డ్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాలు ప్రారంభం

జహీరాబాద్, ఏప్రిల్ 4: మండలంలోని మల్చెల్మా సమీపంలోని హజ్రత్ మన్నాన్ సాహెబ్ దర్గా ఉర్సు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలకు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు కులమతాలకు అతీతంగా తరలివచ్చి దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉత్సవాల్లో భాగంగా దివంగత మాజీ ఎంపీ, మంత్రి, ఎమ్మెల్యే బాగారెడ్డి కుటుంబ సభ్యులు గంధంతో ఊరేగింపుగా తరలివెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నిర్వహించిన ఖవ్వాలి భక్తులను ఆకట్టుకుంది. 5వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు కుస్తీ పోటీలు, ఉర్సు ఉత్సవాల ముగింపు, తీర్థ ప్రసాదాల వితరణ తదితర కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ప్రమాణం చేసిన బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

బార్ అసోసియేషన్ కమిటీ ప్రమాణం

సంగారెడ్డి, ఏప్రిల్ 4: సంగారెడ్డి బార్ అసోసియేషన్ ఎన్నికల్లో తొమ్మిదో సారి విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు అధ్యక్ష, కార్యదర్శులు, పూర్తి కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా భూపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా మహేశ్, సంయుక్త కార్యదర్శిగా మల్లేశం, కోశాధికారిగా శ్రీకాంత్, గ్రంథాలయ కార్యదర్శిగా నిజాముద్దీన్ రషీద్, క్రీడలు-సాంస్కృతిక కార్యదర్శిగా శ్రీనివాస్, మహిళా ప్రతినిధిగా మంజుల, కార్యనిర్వాహక సభ్యులుగా బుచ్చయ్య, సుభాశ్‌చందర్, నరసింహ, మాణిక్‌రెడ్డి, రాములు, దత్తాత్రి, భాస్కర్ ప్రమాణం చేశారు.

కంది డంప్‌యార్డును క్లీన్ చేయాలి

డంప్‌యార్డును పరిశీలిస్తున్న డీపీవో

కంది, ఏప్రిల్ 4:కంది డంప్ యార్డును క్లీన్ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సాయి బాబా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కంది డంప్ యార్డు, సెగ్రిగేషన్ షెడ్డును డీపీవో తనిఖీ చేశారు. డంప్ యార్డులో ఉన్న చెత్తను పూర్తిగా క్లీన్ చేయాలన్నారు. యార్డుకు ఇంకో స్థలాన్ని చూడాలని సూచించారు. అనంతరం డబుల్ బెడ్‌రూం వద్ద సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించారు. తడి,పొడి చెత్తను వేరు చేసి సేంద్రీయ ఎరువులు తయారు చేయాలనే లక్ష్యంతో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డును నిరుపయోగంగా ఎందుకు ఉంచారని, వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. గ్రామంలో చెత్త సేకరణ, పారిశుధ్యం, పరిశుభ్రతపై ఆరా తీశారు. డీఎల్‌పీవో అనిత, ఎంపీవో మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విద్యాదర్‌గౌడ్ ఉన్నారు.

గుమ్మడిదల తహసీల్దార్‌గా పరమేశం

గుమ్మడిదల, ఏప్రిల్4: గుమ్మడిదల తహసీల్దార్‌గా పరమేశం బాధ్యతలు తీసుకోనున్నారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన గంగాభవాని మునిపల్లి మండలానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో సంగారెడ్డి కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటీవ్‌లో ఏవోగా విధులు నిర్వహిస్తున్న పరమేశం బాధ్యతలు తీసుకోనున్నారు.

సన్నబియ్యం పంపిణీ సజావుగా జరగాలి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 4: సన్న బియ్యం పంపిణీ సజావుగా జరిగేలా పకడ్బందీగా పర్యవేక్షించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి కలెక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో వారు మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఏడాదికి దాదాపు రూ.13 వేల కోట్ల భారం పడుతున్నప్పటికీ ఆహారభద్రత కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. రేషన్ దుకాణాలకు సకాలంలో బియ్యం చేరేలా, డీలర్లు కార్డుదారుల సంఖ్య మేరకు సరిపడా నిల్వలు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. సన్నబియ్యం పంపిణీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, ఎక్కడైనా అవినీతి, అక్రమాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్, అధికారులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ చేసిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, ఏప్రిల్ 4: హత్నూర మండలం దౌల్తాబాద్‌లో ప్రభుత్వం సరఫరా చేసిన సన్నబియ్యాన్ని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. సంక్షేమ పథకాలు ప్రతిఒక్కరికీ చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం చీక్‌మద్దూర్‌లో జరిగిన రేణుకాఎల్లమ్మ కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిఒక్కరూ భక్తిభావంతో నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫర్హీన్‌షేక్, నాయకులు చంద్రాగౌడ్, రాంచంద్రారెడ్డి, అంబటి అర్జున్, చెన్న నర్సింహులు, శ్రీకాంత్, వీరేందర్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



దౌల్తాబాద్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ఆదర్శ్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న మహిళా నాయకురాళ్లు

బీఆర్ఎస్ నేతకు అభినందనల వెల్లువ

రామచంద్రాపురం, ఏప్రిల్ 4: పటాన్‌చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా వెన్నవరం ఆదర్శ్‌రెడ్డిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నియమించినందుకు పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సొసైటీ సభ్యులు ఆర్సీపురం డివిజన్‌లో ఉన్న ఆదర్శ్‌రెడ్డి నివాసానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తమపై చూపుతున్న ఆదరాభిమానాలకు జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని అజేయ శక్తిగా నిలుపుతామని చెప్పారు. బీఆర్ఎస్ నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు పటాన్‌చెరు నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లి పటాన్‌చెరు సత్తా చూపిస్తామని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశాలు, జెండా ఆవిష్కరణలు నిర్వహిస్తామన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు తనపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డును బాగుచేయండి సారు..!

గంగ్వార్ చౌరస్తాలో వరద నీరు నిల్వతో అవస్థలు పడుతున్న వాహనచోదకులు

జహీరాబాద్, ఏప్రిల్ 4:న్యాల్‌కల్ మండలంలోని గంగ్వార్ చౌరస్తాలో రోడ్డుపై వరద నీరు నిల్వడంతో కంకర తెలి అధ్వాన్నంగా తయారైంది. ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాల్వలు కబ్జాకు గురయ్యాయి. వర్షాకాలంతోపాటు అకాల వర్షాలు కురిస్తే చాలు వరదనీరు ఎక్కడికి వెళ్లకుండా రోడ్డుపైనే నిలవడంతో వాహనచోదకులు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి వాహనచోదకులు, ప్రజలు తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. జిల్లా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాలుడిని తల్లి చెంతకు చేర్చిన పోలీసులు

అమీన్‌పూర్ పోలీసుల వద్ద నుంచి బాలుడిని తీసుకున్న తల్లి సునంద

అమీన్‌పూర్, ఏప్రిల్ 4: బాలుడు అదృశ్యమై కొన్ని గంటల్లోనే తల్లిదండ్రుల చెంతకు చేరిన సంఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...మున్సిపల్‌పరిధిలోని న్యూ సాయి భాగవాన్ నగర్ కాలనీ రోడ్డు నంబరు 6లో మూడేండ్ల బాలుడు మధ్యాహ్నం రెండు గంటలకు తల్లి నుంచి తప్పిపోయి ఏడ్చుకుంటూ తిరుగుతుండం స్థానికులు గమనించారు. విషయాన్ని పోలీసులకు చెప్పడంతో బాలుడిని పీఎస్‌కు తరలించి ప్రచార మాధ్యమాల ద్వారా తల్లిదండ్రులకు తెలిపే ప్రయత్నం చేశారు. కొన్ని గంటల్లోనే బీరంగూడ శివాలయం రోడ్డులో ఉంటున్న తల్లిదండ్రులు సునంద, హన్మంత్ పోలీసుల వద్ద నుంచి బాలుడిని తీసుకెళ్లారు.

ఉపాధి హామీ కూలీల బకాయిలు చెల్లించాలి

మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహులు

సదాశివపేట, ఏప్రిల్ 4:ఉపాధి హామీ కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలపరిధిలోని పెద్దాపూర్‌లో ఉపాధి హామీ కూలీల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా ఉపాధి హామీ కూలీల బకాయిలు పేరుకుపోయాయన్నారు. ఈనెల15న ఉపాధి హామీ కూలీలతో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని, అధిక సంఖ్యలో కూలీలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజయ్య, నరేశ్, సతీశ్, అరుణ్, యాదయ్య, సంతోష, బిపాషా, చంద్రయ్య, జోగయ్య, రాంచందర్, పద్మమ్మ, నర్సింహులు, మల్లేశం పాల్గొన్నారు.

ఎస్పీ పరితోష్ పంకజ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు తదితరులు

ఎస్పీని కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 4: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ పరితోష్ పంకజ్‌ను శుక్రవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మర్యాపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు జిల్లా పరిస్థితులను ఎస్పీకి వివరించారు. ఎస్పీని కలిసిన వారిలో మాజీ సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు ప్రభాకర్, విఠల్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సంబంధిత అధికారులకు సూచించారు. పట్టణవాసుల నుంచి నీటి సమస్యపై వినతులు అందిన నేపథ్యంలో ఎమ్మెల్యే అధికారులతో శుక్రవారం మాట్లాడారు. సంగారెడ్డి, సదాశివపేట పట్టణాలతో పాటు వివిధ గ్రామాల్లో నీటి సమస్య ఏర్పడిందని, వెంటనే పరిష్కరించాలని సూచించారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో బోర్ మోటరు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. సుదూర ప్రాంతాలు, గ్రామాలు, తండాల్లో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు తగిన వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేసేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు.

చెరువులో ఇద్దరు గల్లంతు

బీమునిచెరువులో గాలింపు చేపట్టిన దృశ్యం

హత్నూర, ఏప్రిల్ 4: చెరువులో పడి ఇద్దరు వ్యక్తులు గల్లంతైన ఘటన బోర్పట్ల శివారులోని బీమునిచెరువులో శుక్రవారం చోటుచేసుకుంది. హత్నూర పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన డప్పు నవీన్, కొండాపూర్ మండలం కొత్తగడి (వీరభద్రపల్లి)కి చెందిన ప్రేమ్‌కుమార్ మధ్యాహ్నం చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతయ్యారు. గమనించిన స్థానికులు చెరువు వద్దకు వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సర్సాపూర్ నుంచి ఫైర్ సిబ్బందిని రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం నుంచి చీకటిపడే వరకు గాలింపు చర్యలు చేపట్టినా దొరకలేదు. శనివారం గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

ఈనెల 7 నుంచి చిన్నారులకు కంటి పరీక్షలు

మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ గాయత్రీదేవి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 4: జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో సున్నా నుంచి ఆరేండ్ల వయస్సు గల పిల్లలకు ఈ నెల 7 నుంచి కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవి స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పీఎంవో, ఆర్బీఎస్కే ద్వారా కంటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిల్లల తల్లిదండ్రులను కోరారు. సమవేశంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వోలు డాక్టర్ సునంద, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ మనోహర్‌రెడ్డి, ఆర్బీస్కే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

ఆర్సీపురంలో ర్యాలీ తీస్తున్న ముస్లింలు

రామచంద్రాపురం,ఏప్రిల్ 4: కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఆర్సీపురం డివిజన్‌లో మైనార్టీలు నిరసన చేపట్టారు. ఆర్సీపురం మసీద్ నుంచి షాపింగ్ ఏరియా మీదుగా మైనార్టీలు ర్యాలీ నిర్వహించారు. మైనార్టీ నాయకులు షేక్ అబ్దుల్ ఘనీ, షేక్ అబ్దుల్ ఖదీర్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమానికి ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ అమాండ్మెంట్ బిల్లుపై దేశంలోని అన్ని రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

మాట్లాడుతున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

జహీరాబాద్, ఏప్రిల్ 4:హత్య కేసును జహీరాబాద్ పోలీసులు ఛేదించారు. గతనెల 30న పస్తాపూర్‌లో ఓ మహిళ కంట్లో కారంపొడి చల్లి సిలిండర్‌తో దాడి చేసి హత్య చేశారు. హంతకుడు పోలీసుల కండ్లు కప్పి హైదరాబాద్‌కు పారిపోతుండగా జహీరాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్నారు. శుక్రవారం సీఐ కార్యాలయంలో జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి మహిళ హత్యకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కోహీర్ మండలంలోని గోటిగార్‌పల్లికి చెందిన సత్యారం రమేశ్ (26) ఝరాసంగం మండలంలోని చీలేమామిడి గ్రామానికి చెందిన లక్ష్మి(40)తో కొంతకాలంగా సహజీవనం కొనసాగిస్తున్నాడు. సత్యారం రమేశ్ ప్రవర్తన సరిగా లేనందున లక్ష్మి అతడిని దూరం పెట్టి వేరే వ్యక్తులతో సన్నిహితంగా ఉంటుంది. దీంతో ఆమెను ఎలాగైనా హత్య చేయాలని సత్యారం రమేశ్ నిర్ణయించుకున్నాడు. గత నెల 29న పస్తాపూర్‌లోని ఆర్టీఏ కార్యాలయ సమీపంలోని కల్లు దుకాణంలో ఇద్దరు కలిసి కల్లు తాగారు. పథకం ప్రకారం ఆమెను పెట్రోల్ పోసి చంపేందుకు ప్రయత్నించగా, అక్కడే ఉన్న మ్యాతరి మరియమ్మ అడ్డుకోవడంతో ప్రయత్నం ఫలించలేదు. తిరిగి అదే నెల 30న ఉదయం ఆమె ఇంటికి సరమేశ్ వెళ్లాడు. తనతో గడపాలని ఆమెపై ఒత్తిడి తెచ్చాడు. అందుకు ఆమె ఒప్పుకోకపోవడంతో ఇరువురు గొడవపడ్డారు. దీంతో రమేశ్ ఆమె కండ్లలో కారంపొడి చల్లి పక్కనే ఉన్న ఐదు కిలోల గ్యాస్ సిలిండర్‌తో దాడి చేశాడు. లక్ష్మి అరుపులు విని చుట్టుపక్కల వారు రావడం చూసిన రమేశ్ ఆమె సెల్‌ఫోన్ తీసుకొని పారిపోయాడు. గ్యాస్ సిలిండర్‌తో బలంగా దాడి చేయడంతో ఘటనా స్థలంలోనే ఆమె మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జహీరాబాద్ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం గాలిస్తున్న క్రమంలో శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు పారిపోయేందుకు ప్రయత్నిస్తుంగా బస్టాండ్‌లో పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడిని అరెస్టు చేసి జహీరాబాద్ కోర్టులో హాజరుపర్చారు. మహిళ హత్య కేసు చేధించడంతోపాటు నిందితుడిని చకచక్యాంగా వ్యవహరించి పట్టుకునేందుకు జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం, ఎస్ఐ కాశీనాథ్ అధ్వర్యంలో ట్రైనీ ఎస్ఐలు సుజీత్, నర్సింహులు, హెడ్‌కానిస్టేబుల్ ఓదేవ్, సిబ్బంది ఆనంద్‌లను డీఎస్పీ అభినందించారు.

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు

మాట్లాడుతున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

జహీరాబాద్, ఏప్రిల్ 4: జహీరాబాద్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న జనాభా దృష్ట్యా పట్టణంలో ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రధాన చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్, ప్రత్యేక పార్కింగ్ తదితర వాటిని ఏర్పాటు చేశామన్నారు. వాహనచోదుకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. హైదరాబాద్-ముంబయి 65వ జాతీయ రహదారిపై ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడుతుండగా, మరికొందరు గాయాలబారిన పడుతున్నారని చెప్పారు. ప్రమాదాలు జరగకుండా బ్లాక్ స్పాట్లను గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలోని ప్రధాన చౌరస్తాలు, కూడళ్లు, 65వ జాతీయ రహదారి మార్గాల్లో సీఐ, ఎస్ఐ శివలింగం, కాశీనాథ్‌లు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దాదాపు 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో సీఐ, ఎస్ఐ పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో ఘనంగా వార్షికోత్సవం

విద్యార్థులకు మెమోంటోలు అందజేస్తున్న అధ్యాపకులు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 4: మహిళా డిగ్రీ కళాశాలలో 45వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వేడుకలకు జిల్లా ఐడీ కళాశాల, తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణాభాయితో కలిసి జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్య అందుతుందన్నారు. జిల్లాలోని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హిటాచి కంపెనీ ప్రతినిధి రాజు, కళాశాలల ప్రిన్సిపాళ్లు బంగ్ల భారతీ, సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు అనుమతులు ఉపసంహరించుకోవాలి

దీక్ష చేపట్టిన బొంతపల్లి ఆలయాల కమిటీ సభ్యులకు సంఘీభావం తెలుపుతున్న జేఏసీ నేతలు

గుమ్మడిదల, ఏప్రిల్ 4:ప్యారానగర్ డంపింగ్ యార్డు అనుమతులను ఉపసంహరించుకోవాలని జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 59వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో బొంతపల్లి గ్రామానికి చెందిన ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వీరికి జేఏసీ నాయకులు సంఘీభావం తెలిపారు.నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్‌లలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్యారానగర్ సమీపంలో జీహెచ్ఎంసీ చేపట్టిన డంపింగ్ యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ)కు ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రెండు నెల